సాక్షి
అనకాపల్లి
గురువారం । 16 । జనవరి । 2025



దేవరాపల్లిలో వేదికపై నుంచి కోళ్ల పందేలను తిలకిస్తున్న ఎంపీ సి.ఎం.రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి (ఇన్‌సెట్) వేంపాడులో బరిలో కోడిపుంజుతో ఎంపీ రమేష్

కూటమి నేతలకే అసలైన సంక్రాంతి!

- ఇష్టారాజ్యంగా కోడి పందేల నిర్వహణ
- లాటరీ బల్ల, బెల్టు షాపులకు వేలం పాట
- మామూళ్లు తీసుకుని కేసులు పెట్టకుండా జాగ్రత్తపడ్డ పోలీసులు
- బెల్టు షాపులకు అక్రమ వసూళ్లతో అధికార ముద్ర వేసిన ఎక్సైజ్ సిబ్బంది
- ఏకంగా పోలీసు బందోబస్తుతో పాఠశాలలో కోడి పందేల నిర్వహణ
- ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు
- హోం మంత్రి ఇలాకాలో కోడి పందేల జోరు



కోళ్లను ఉసిగొల్పుతున్న పందెంరాయుళ్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పేదల ఇళ్లల్లో నగదు కొరత కారణంగా ఈ సంక్రాంతి నిరాడంబరంగా జరగ్గా.. కోడి పందేల నిర్వహణతో కొందరు కూటమి నేతలు భారీగా ఆదాయం సమకూర్చుకున్నారు. ప్రధానంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి నియోజకవర్గమైన పాయకరావుపేటతోపాటు యలమంచిలి, మాడుగుల నియోజకవర్గాల్లో కోడి పందేలు భారీ స్థాయిలో జరిగాయి. పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కోడి పందాలు జరగగా.. యలమంచిలిలోనూ భారీ ఎత్తున నిర్వహించారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలోనే పాఠశాలలో పోలీసుల బందోబస్తు మధ్య పందేలు నిర్వహించడం గమనార్హం. ఈ మూడు నియోజకవర్గాల్లో భారీ ఎత్తున టెంట్లు వేసి ఈ కార్యకలాపాలు నిర్వహించగా, మిగిలిన నియోజక వర్గాల్లో కూడా గట్టిగానే జరిగాయి. పోలీసులు మాత్రం చిన్న చిన్న కేసులు నమోదు చేసి తమ బాధ్యతను నిర్వర్తించినట్లు ప్రకటించినప్పటికీ, అసలైన నిర్వాహకుల జోలికి పోకుండా జాగ్రత్త పడ్డారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక బెల్టు షాపుల నిర్వహణకు అనుమతులిచ్చి అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారులు భారీగానే సంక్రాంతి మామూళ్లు వసూలు చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అటు కూటమి నేతలు... ఇటు వివిధ శాఖల అధికారులు సంక్రాంతి పండగను బాగానే చేసుకున్నారు. ఈ కార్యకలాపాల వల్ల మొత్తంగా రూ.10 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది.

పాఠశాలలో.. పోలీసు బందోబస్తుతో..



మాడుగుల నియోజకవర్గంలో కూటమి నేతలు మరో అడుగు ముందుకు వేశారు. దేవరాపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పోలీసు బందోబస్తు నడుమ కోడి పందేలు నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరైన సంక్రాంతి వేడుకల్లో ఇలా జరగడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలను కోడిపందేలకు వేదికగా మార్చడం, పైగా పోలీస్ బందోబస్తు కల్పించంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఒక వైపు ప్రభుత్వ విద్యను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ఇప్పుడు ఏకంగా కోడి పందేలకు ప్రభుత్వ పాఠశాలను కేంద్రంగా మార్చిన కూటమి నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. అలాగే భీమిలి, పెందుర్తి, గాజువాక, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో కూడా భారీ స్థాయిలో కాకపోయినా.. జోరుగా కోడిపందేలు సాగాయి.

హోం మంత్రి ఇలాకాలో..

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో భారీ స్థాయిలో కోడి పందేలు జరిగాయి. అడ్డురోడ్డుతో పాటు వేంపాడు టోల్‌ప్లాజా వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసి మరీ కోడి పందేలు నిర్వహించడం గమనార్హం. ఈ వ్యవహారమంతా తెలిసినా అటువైపుగా పోలీసులు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. వందల మంది ప్రజలు గుమిగూడి భారీగా కోడి పందేలు నిర్వహిస్తున్నా.. ఏదైనా సంఘటన జరిగితే స్పందించే దిక్కులేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టాన్ని రక్షించాల్సిన హోంమంత్రి నియోజకవర్గంలోనే సుప్రీంకోర్టు ఆదేశాలకు భిన్నంగా కోడి పందేలతోపాటు లాటరీ బల్ల, బెల్టు షాపులను నిర్వహించడం, అటు పోలీసులు కానీ ఇటు ఎక్సైజ్ సిబ్బంది గానీ పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లాటరీ బల్ల, బెల్టు షాపు నిర్వహణను హోం మంత్రి అనుచరులు దక్కించుకుని... ఇష్టారీతిలో జూదాన్ని ప్రోత్సహించారు. మద్యాన్ని అధిక ధరలకు విక్రయించారు. మామూళ్లు అందడంతోపాటు ఇటువైపు చూడొద్దన్న ఆదేశాలతోనే పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది కిమ్మనకుండా ఉండిపోయారని తెలిసింది.

యలమంచిలిలోనూ అదే జోరు...!

పాయకరావుపేట నియోజకవర్గం తర్వాత భారీగా కోడి పందేలు నిర్వహించిన నియోజకవర్గంగా జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న యలమంచిలి నిలిచింది. నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలం రామన్నపాలెం వద్ద కోడి పందేల బరులను ఏర్పాటు చేసి.. లాటరీ బల్లతో పాటు బెల్టు షాపులకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో మునగపాకకు చెందిన వ్యక్తి బెల్టు షాపును, యలమంచిలికి చెందిన జనసేన కార్యకర్త లాటరీ బల్ల నిర్వహణ హక్కును దక్కించుకున్నట్లు సమాచారం. ఇక్కడ కూడా జూదం, అధిక ధరలకు మద్యం అమ్మకాలు బహిరంగంగా జరిగినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. మరోవైపు కోడి పందాలు, మద్యం విక్రేతల నుంచి రూ.720, రూ.2,100 పట్టుకున్నట్లు పోలీసులు విడుదల చేసిన పత్రికా ప్రకటన చూసి ప్రజలతో పాటు నిర్వాహకులు నవ్వుకున్నారు. కోట్ల రూపాయలతో జరిగే పందేలను పట్టించుకోకుండా.. గల్లీల్లో సరదాకు ఆడుకునే వారిని పట్టుకుని కేసులు నమోదు చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

బొజ్జన్నకొండ వైభవం

- తీర్థానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పోటెత్తిన పర్యాటకులు
- బౌద్ధ మేళాకు దేశ విదేశాల నుంచి తరలివచ్చిన బౌద్ధ భిక్షువులు



బొజ్జన్నకొండకు సందర్శకుల తాకిడి



స్తూపం వద్ద పూజలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు

అనకాపల్లి: చారిత్రక విశేషాల సమాహారం బొజ్జన్నకొండ వైభవాన్ని కనులారా వీక్షిస్తూ కనుమ పండుగ రోజున జరిగే ఉత్సవంలో సందర్శకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేశ విదేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు బుధవారం ఉదయం జరిగిన బౌద్ధ మేళాకు హాజరయ్యారు. సాయంత్రం జరిగిన జాతరకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా సాగింది. జంక్షన్ల వద్ద వాహనాలు నిలిపివేసి, ప్రజలను కొండవైపు పంపించారు. ఈ సందర్భంగా గాలిపటాలను ఎగురవేస్తూ యువకులు, చిన్నారులు సందడి చేశారు. పిల్లలతోపాటు పెద్దలు కుటుంబ సమేతంగా వచ్చి బౌద్ధ స్తూపాలను దర్శించుకుని, కొండపై గల గృహాలు, పురాతన శిల్పాలను తిలకించారు. బొజ్జన్నకొండ, లింగాలకొండలు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. రంగులరాట్నం, ఆకాశచక్రం ఆకట్టుకున్నాయి. డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో రూరల్, పట్టణ సీఐలు అశోకుమార్, టి.వి.విజయకుమార్ 80మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా బౌద్ధ మేళా

ఉమ్మడి విశాఖ జిల్లాల బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో కొండ దిగువన బౌద్ధ మేళా నిర్వహించారు. అనంతరం బౌద్ధ పతాకంతో కొండపై గల ప్రధాన స్థూపం వరకు శాంతి ఊరేగింపు చేపట్టారు. బుద్ధుడి గుహలో ప్రధాన స్థూపం వద్ద పుష్పాంజలి, బుద్ధ వందనం, దమ్మదీక్షని నాగపూర్‌కు చెందిన బౌద్ధవులు వెనరబుల్ డాక్టర్ జ్ఞానదీప్ మహోథేరో, బోధ్గరత్న మహోథేరోలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించే తత్వం ఉన్న బౌద్ధ మతాన్ని విదేశాల్లో ఎక్కువ ఆదరిస్తున్నారన్నారు. బౌద్ధ సంఘాల అధ్యక్షుడు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బొజ్జన్నకొండను, విశాఖలో తొట్లకొండను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం భూమి మాసపత్రిక, క్యాలెండర్‌ను శ్రీనివాస్ ఆవిష్కరించారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ విశాఖ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, వివిధ సంఘాల నాయకులు బోర వేణుగోపాల్ గౌతమ్, గొంది నవీన్, కర్రి సత్యనారాయణ, ధమ్మాచారి రావూరి విజయకుమార్, బల్లా నాగభూషణం, బోర లోకేశ్వరరావు బోధి, జెవి.ఝాన్సీలక్ష్మి, పల్లా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త అల్లుళ్లకు వినూత్న విందు



మాడుగుల రూరల్: వంద వంటకాలతో చిరంజీవి, ఉమాదేవిలకు విందు భోజనం



యలమంచిలి రూరల్: మెగా విందు చూసి ఆనందం వ్యక్తం చేస్తున్న కొత్త జంట తరుణ్ సాయికుమార్, సుష్మిత

యలమంచిలి రూరల్/మాడుగుల రూరల్: సంక్రాంతికి అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుళ్లకు వంద రకాల వంటకాలతో విందు ఏర్పాటు చేయడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా 108 రకాల వంటకాలతో కొత్త అల్లుడిని మైమరపించారు యలమంచిలి పట్టణం భవనం వీధికి చెందిన నగల వ్యాపారి బండారు సురేష్, పద్మావతి దంపతులు. ఇటీవల తన కుమార్తె సుష్మిత వివాహాన్ని తరుణ్ సాయికుమార్‌తో జరిపించారు. మొదటిసారిగా సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్త అల్లుడిని కూతురిని ఇంటికి ఆహ్వానించిన సురేష్ దంపతులు అల్లుడికి శాకాహారం ,పిండి వంటలు, స్వీట్లు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, శీతల పానీయాలు.. ఇలా 108 రకాలు చిన్న చిన్న కప్పులలో ఉంచి వాటిని అందంగా అలంకరించి రుచి చూపించారు. ఈ మెగా విందులో వంటకాలు చూసి అల్లుడు తరుణ్ సాయికుమార్ ఆశ్చర్యానికి లోనయ్యారు. శాకాహారంలో ఇన్ని రకాల వంటకాలు ఉంటాయని ఇప్పుడే చూశానని చెబుతూ వాటిని కుటుంబమంతా తిని ఆనందించడం జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుందని చెప్పారు. అలాగే మాడుగుల మండలంలోని వీరవిల్లి అగ్రహారానికి చెందిన పల్లేల వెంకట సత్యనారాయణ, వెంకట లక్ష్మి దంపతుల కుమార్తె ఉమాదేవికి రాజాంకు చెందిన చిరంజీవితో గత ఏడాది వివాహం అయింది. సంక్రాంతి పండుగకి కొత్త అల్లుడిని అత్తింటి వారు ఆహ్వానించారు. ఇంటికొచ్చిన కొత్త అల్లుడిని కుటుంబ సభ్యులు మర్యాదలతో ఇంట్లోకి తీసుకువెళ్లారు. కనుమ సందర్భంగా బుధవారం కొత్త దంపతులకు వంద రకాల వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఆంధ్రాలోని అన్ని ప్రాంతాలకు చెందిన వెజ్, నాన్ వెజ్, స్వీటు, హాట్ వంటకాలు అరిటాకులో వడ్డించి కొత్త అల్లుడికి రుచి చూపించారు. కొత్త అల్లుడికి జీవితాంతం గుర్తుండేలా విందు భోజనం ఏర్పాటు చేయడం విశేషంగా చెప్పుకుంటున్నారు.

మాజీ డిప్యూటీ సీఎం బూడి కారుకు ప్రమాదం
- వేగంగా వచ్చి ఢీ కొట్టిన ద్విచక్ర వాహనం
- ముత్యాలనాయుడు క్షేమం

8లో

పండగ పూట విషాదం
- రేవుపోలవరం బీచ్‌లో మునిగి బాలుడు మృతి
- యువకుడు గల్లంతు

8లో

సకుటుంబ సపరివారం



సంక్రాంతి పండగ అనుబంధాలకు ఆలవాలం! ఎంత దూరంలో ఉన్నవారైనా పెద్ద పండగకు స్వగ్రామానికి వచ్చి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య ఆనందంగా గడుపుతారు. తిమ్మరాజుపేటకు చెందిన మళ్ల సూర్యనారాయణ-మాణిక్యం దంపతుల కుటుంబ సభ్యులు సంక్రాంతి పండుగ రోజున అరటి ఆకులో ఇలా సహపంక్తి భోజనాలు చేశారు.

-మునగపాక


అయ్యన్న ముంగిట్లో సీఎం రమేష్ హడావుడి
రగులుతున్న కుంపటి

- మూడు రోజులుగా నర్సీపట్నంలో తిష్ట వేసిన సీఎం రమేష్
- బీజేపీ, జనసేన నేతలతో కలిసి సంక్రాంతి సందడి
- కన్నెత్తి చూడని అయ్యన్న, టీడీపీ నేతలు
- స్పీకర్ ఆధ్వర్యంలో జరిగే మకరజ్యోతి మహోత్సవానికి రమేష్‌కు అందని ఆహ్వానం
- బీజేపీలో చేరికలపై అయ్యన్న ఆగ్రహం
- తనకు సమాచారం లేకుండా చేర్చుకున్నారని మండిపాటు
- ప్రధాని పర్యటనలో తనకు కనీస గౌరవం ఇవ్వకపోవడంపై కినుక?

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అయ్యన్న ముంగిట్లో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సంక్రాంతి సందడి చేశారు. నర్సీపట్నంలోని ప్రైవేటు రిసార్టులో గత మూడు రోజులుగా మకాం వేసిన రమేష్... సంక్రాంతి వేడుకలను బీజేపీ, జనసేన నేతలతో కలిసి నిర్వహించుకున్నారు. ఇటువైపు కనీసం టీడీపీ నేతలు కన్నెత్తి చూడలేదు. మరోవైపు స్పీకర్ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో జరుగుతున్న మకర జ్యోతి మహోత్సవాలకు సీఎం రమేష్‌ను ఆహ్వానించలేదు. ఒకవైపు నర్సీపట్నం కేంద్రంగా పలువురు నేతలను తనకు తెలియకుండా బీజేపీలో చేర్చుకోవడంతో పాటు పోటీగా రాజకీయాలు చేస్తున్నారని అయ్యన్న భావిస్తున్నట్టు తెలుస్తోంది. తనకు కనీస సమాచారం లేకుండా జరుగుతున్న చేరికలపై ఆయన ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం. మరోవైపు కొద్దిరోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన ప్రధాని సభ సందర్భంగా కూడా స్పీకర్ హోదాలో తనకు కనీస గుర్తింపు దక్కలేదని ఆయన కినుక వహించినట్టు తెలుస్తోంది. ప్రధాని సభకు జన సమీకరణ సందర్భంగా... నర్సీపట్నంలో మీరు చేర్చుకున్న నేతల ద్వారా జనాలను తరలించుకోండంటూ సీఎం రమేష్‌కు అయ్యన్న గట్టిగా బదులిచ్చినట్టు సమాచారం. మొత్తంగా నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు రిసార్టు కేంద్రంగా జరిగిన సంక్రాంతి వేడుకలు కాస్తా కూటమిలో భోగి మంటలను మించి వేడిని రాజేశాయని అర్థమవుతోంది.

కొరివితో తలగోక్కున్నట్టు...!

వాస్తవానికి అనకాపల్లి ఎంపీ పోటీలో స్థానికేతరుడైన దిలీప్‌కుమార్‌కు సీటు ఇవ్వాలని టీడీపీ భావించింది. ఈ సీటును తన కుమారుడి కోసం ఆశించిన అయ్యన్నపాత్రుడు... స్థానికేతరులకు టికెట్ ఇస్తే సహకరించేది లేదంటూ ఎన్నికల ముందు జరిగిన పార్టీ సమావేశాల్లో బహిరంగంగానే మాట్లాడారు. అయితే, పొత్తులో భాగంగా ఈ సీటును బీజేపీకి వదులుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఈ స్థానంలో ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్‌ను బీజేపీ ప్రకటించింది. అనూహ్యంగా అయ్యన్నపాత్రుడు రమేష్‌ను వెంటబెట్టుకుని మరీ ఎన్నికల్లో కలియతిరిగారు. మిగిలిన నేతల కంటే ఎక్కువగా సీఎం రమేష్‌తో సఖ్యతగా మెలిగారు. తీరా ఎన్నికల తర్వాత నర్సీపట్నంలోనే సీఎం రమేష్ రాజకీయం మొదలుపెట్టారు. దీంతో కొరివితో తలగొక్కున్నట్టుగా పరిస్థితి తయారయ్యిందని అయ్యన్న వాపోతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు విశాఖలో ప్రధాని పర్యటన సందర్భంగా నర్సీపట్నం నుంచి జనసమీకరణపై సీఎం రమేష్ అయ్యన్నను కదిపే ప్రయత్నం చేశారు. మీరు చేర్చుకున్న నాయకులతో జనాలను తరలించుకువెళ్లండంటూ అయ్యన్న గట్టిగానే బదులిచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సంక్రాంతి సందర్భంగా సీఎం రమేష్ నర్సీపట్నంలో మకాం వేయడం చర్చనీయాంశమవుతోంది. సీఎం రమేష్ సమక్షంలో బీజేపీలో చేరిన ఇద్దరు విశాఖ డెయిరీ డైరెక్టర్లతో పాటు ఓ డాక్టర్, జనసేన నేతలు సదరు ప్రైవేటు రిసార్టు వద్ద హడావుడి చేస్తున్నారు. అయితే, అటువైపు ఏ ఒక్క టీడీపీ నేత కానీ కార్యకర్త కానీ వెళ్లకపోవడం గమనార్హం.



విశాఖ డెయిరీ డైరెక్టర్ల చేరికపై...!

విశాఖ డెయిరీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ హడావుడిగా అసెంబ్లీలో సభా సంఘాన్ని స్పీకర్ అయ్యన్న ఏర్పాటు చేశారు. దీనిపై పార్టీలోని నేతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయనే ప్రచారం ఉంది. మరోవైపు తమ పార్టీలో విశాఖ డెయిరీ నేతలను చేర్చుకుంటున్నట్టు సీఎం రమేష్.... అయ్యన్నకు సమాచారమిచ్చినప్పటికీ ఆ విషయంలో ముందుకు వెళ్లడంపై కూడా సీఎం రమేష్ అసహనాన్ని వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నర్సీపట్నం నియోజకవర్గంలోని ఇద్దరు విశాఖ డెయిరీ డైరెక్టర్లు సూర్యనారాయణ, రాజకుమారిలను బీజేపీలో చేర్చుకున్నారు. అంతేకాకుండా నర్సీపట్నంలోని డాక్టర్ కిలాడి సత్యనారాయణను కూడా తాజాగా ప్రధాని పర్యటన సందర్భంగా బీజేపీలో చేర్చుకున్నారు. ఈ చేరిక వెనుక కూడా సీఎం రమేష్ ఉన్నట్టు అయ్యన్న మండిపడుతున్నారు. అనకాపల్లి జిల్లాలో సీఎం రమేష్ అంటే ఎవరో తెలియని సందర్భంలో ప్రతీ చోట పరిచయం చేసిన తననే లెక్కచేయకపోవడంపై అయ్యన్న ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మొత్తంగా సంక్రాంతి పండుగ కాస్తా కూటమి నేతల మధ్య కుంపటి రాజేసిందని చెప్పవచ్చు.

క్లుప్తంగా

జాతీయ సదస్సుకు మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్


అవార్డు అందుకుంటున్న వెంకటలక్ష్మి

చీడికాడ: ఉత్తమ విద్యా విధానంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఏపీ నుంచి మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఇటీవల ఢిల్లీలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ 'ఎక్సెంప్లర్స్ ఆఫ్ చేంజ్ అండ్ ఇన్నోవేషన్-2025' సదస్సు నిర్వహించింది. రాష్ట్రం నుంచి ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆమె ఉత్తమ విద్యా విధానాల అభివృద్ధిపై ప్రసంగించారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఉపాధ్యాయులు ఎన్నో వినూత్న స్ఫూర్తిదాయకమైన విషయాలను నేర్చుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడిందన్నారు.

రచయిత ఎంవీవీ ఇక లేరు



సీతంపేట(విశాఖ): ప్రముఖ రచయిత ఎం.వి.వి.సత్యనారాయణ బుధవారం మధ్యాహ్నం మద్రిపాలెంలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన వయసు 76 సంవత్సరాలు. ఆయనకు భార్య సత్యవతి, కుమార్తెలు శిరీష, సౌజన్య ఉన్నారు. చందమామ పత్రికలో కథలు, నవలలు రాసి గొప్ప రచయితగా పేరు పొందారు. బాల సాహిత్యం, ప్రౌఢ సాహిత్యం, అపరాధ పరిశోధక సాహిత్యం, అనువాద సాహిత్యంపై ఆయన విశేష కృషి చేశారు. ఆయన పెద్దాపురంలో జన్మించినప్పటికీ, ఉద్యోగ రీత్యా(ఏయూ) విశాఖపట్నంలో స్థిరపడ్డారు. మరణానంతరం ఆయన పార్థివ దేహాన్ని కేజీహెచ్‌కు కుటుంబ సభ్యులు దానం చేశారు. సత్యనారాయణ మృతి పట్ల పలువురు సాహితీవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళా కానిస్టేబుల్ సెల్‌ఫోన్ చోరీ

అగనంపూడి(విశాఖ): సంక్రాంతి పండగ సందర్భంగా దువ్వాడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ముగ్గులు పెడుతున్న మహిళా కానిస్టేబుల్ మొబైల్ ఫోన్ ను ఒక వ్యక్తి చోరీ చేసి, సీసీ ఫుటేజ్ ద్వారా దొరికిపోయాడు. పోలీసులు తెలిపిన వివరా లు. మంగళవారం సంక్రాంతిని పురస్కరించు కు ఓ మహిళా కానిస్టేబుల్ స్టేషన్ ఆవరణలో ముగ్గులు పెడుతూ సెల్ ఫోన్‌ను టేబుల్‌పై పెట్టారు. ఈలోగా అక్కడికి పూటుగా మద్యం సేవించి వచ్చిన వడ్లపూడి రజకవీధికి చెందిన వ్యక్తి ముగ్గుపై ఉమ్మివేశాడు. కానిస్టేబుల్ వారించినా పట్టించుకోలేదు. ఈలోపే టేబుల్ పైనున్న ఫోన్‌ను దొంగిలించాడు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి, సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే అప్పటికీ అతను సెల్‌లోని సిమ్‌కార్డును బయటపడేశాడు. మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

ఘనంగా ఐఎండీ వార్షికోత్సవం

మహారాణిపేట(విశాఖ): భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా విశాఖలో తుపాను హెచ్చరికల కేంద్రం వద్ద బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రాడార్ పనిచేసే విధానం, పైలెట్ బెలూన్, ఉష్ణమానిని, పవన దిశ, ధృతి తెలియజేసే పరికరాలు, వాతావరణ విశ్లేషణా నమూనాలను ప్రదర్శించగా.. విద్యార్థులు తిలకించారు. వాతావరణ శాస్త్రం-భౌతిక సముద్ర శాస్త్ర విభాగం, జియోఫిజిక్స్ అంశాలపై చర్చా కార్యక్రమం జరిగింది. అనంతరం వాతావరణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. చిత్రలేఖనం, వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నేత్రపర్వంగా వెంకన్న గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణకోసం ముస్తాబైన స్వామివారు


గిరి ప్రదక్షిణలో స్వామివారి ఉత్సవ మూర్తులు

- ఉపమాకకు భారీగా తరలివచ్చిన భక్తజనం

నక్కపల్లి: మండలంలోని పాచీనపుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న గిరి ప్రదక్షిణ కార్యక్రమం బుధవారం నేత్ర పర్వంగా జరిగింది.దశావతారాల్లో పదో అవతారమైన కల్కి అవతారంలో స్వామివారు స్వయం వ్యక్తమై కొలువుదీరిన గరుడాద్రి చుట్టూ ఈకార్యక్రమాన్ని ప్రతిఏటా జరుపుతారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసోత్సవాలు ముగిసిన అనంతరం ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో కనుమ నాడు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవెంకటేశ్వరస్వామిని పుణ్యకోటి వాహనంపై ఉంచి, గరుడాద్రి చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. స్వామివారిని ఉత్సవమూర్తులను ఉంచిన వాహనాన్ని మోసేందుకు వందలాది మంది భక్తులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమానికి ముందు ఆలయ అర్చక బృందం స్వామి వారికి నిత్యార్చనలు, బాలభోగ నివేదన,రాజభోగ నివేదన, విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కడియం నుంచి తెచ్చిన పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. స్వామివారితో పాటు వందలాది మంది గరుడాద్రి చుట్టూ తిరిగారు. అనంతరం బందుర సరస్సు వద్ద ఉన్న మండపంలో స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కరి, మకర సంవాదం కార్యక్రమం జరిగింది. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం సందర్భంగా మొసలికి మోక్షం కలిగించే సన్నివేశాన్ని ఆలయ ప్రధానార్చకులు భక్తులకు వివరించారు. తదుపరి స్వామివారికి రాజభోగనివేదన, తిరువారాధన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడి అరటిగెలలు స్వామి వారికి కానుకగా సమర్పించారు. గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొనడానికి నక్కపల్లి,ఉపమాక అడ్డురోడ్డుపరిసరప్రాంత గ్రామాలనుంచి వేలాది మంది తరలి వచ్చారు. స్వామితో పాటు వీరంతా గోవింద నామస్మరణ చేస్తూ గరుడాద్రి చుట్టూ తిరిగారు. ఉపమాక శ్రీనివాస భక్తసమాజం సభ్యులు భజనగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ఉపమాకలో పెద్ద ఎత్తున తిరునాళ్ల నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఉపమాక, సారిపల్లిపాలెం, పెట్టుగోళ్లపల్లి, మనబానవానిపాలెం, జానకయ్య పేట, తదితర గ్రామాలనుంచి తోడపెద్దులను తీసుకువచ్చి చెట్టుభజనలు నిర్వహించారు. పలు గ్రామాలనుంచి వచ్చిన కళకారులు తప్పెటగుళ్ల ప్రదర్శనలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కుమార స్వామి, ఎస్‌ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. టీటీడీ వారు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి స్వామివారి దర్శనం కల్పించారు. ఈకార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు,అర్చకస్వాములు సంకర్షణపల్లి కష్ణమాచార్యులు, పీసపాటి వెంకటశేషాచార్యులు, గోపాలాచార్యులు, నల్లాని చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, నరశింహాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ధనుర్మాసోత్సవాలు


స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా ముగిశాయి. నెలరోజులపాటు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలు మంగళవారం తిరువీధి సేవలతో ముగిశాయని ఆలయప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఉదయం కొండపై, కొండ దిగువన గల ఆలయాలు, ఉపాలయాల్లో అర్చక బృందం అభిషేకాలు, నిత్యపూజలు ధూపదీప నైవేద్యాలు విశేష హోమాలు, నిత్యసేవాకాలములు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి పుష్పతోటలో నీరాట ఉత్సవాలలో భాగంగా విశేష ఆరాధనలు నివేదనలు, సేవాకాలము నిర్వహించిన తర్వాత 30వ పాశురాన్ని విన్నపం చేశారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో సంక్రాంతినాడు ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కొండ దిగువన వేణుగోపాల స్వామి ఆలయంలో, ఆండాళ్లమ్మవారి సన్నిధిలోను స్వామివారు ఉత్సవమూర్తుల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం సంక్రాంతి పండగ సందర్భంగా పద్మావతి, అలువేలుమంగా సమేతుడైన వేంకటేశ్వరస్వామి వారిని ఆంజనేయవాహనంలోను,గోదాదేవి అమ్మవారిని రాజాధిరాజవాహనంలోను వేంచేయింపజేసి గ్రామ మాడవీధుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు.రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం ఉభయ దేవేరులతోకూడిన స్వామివారి ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంలో అధిష్టింపజేసి తిరువీధి సేవ నిర్వహించారు. మకర సంక్రాంతి, ఉత్తరాయణపుణ్యకాలం ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మాజీ డిప్యూటీ సీఎం బూడి కారుకు ప్రమాదం

- వేగంగా వచ్చి ఢీ కొట్టిన ద్విచక్ర వాహనం


ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో దెబ్బతిన్న ముత్యాలనాయుడు కారు ముందు భాగం

దేవరాపల్లి: మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కారును ద్విచక్ర వాహనం ఢీ కొట్టిందని స్థానిక ఎస్‌ఐ టి. మల్లేశ్వరరావు తెలిపారు. మాజీ మంత్రి తనయుడు బూడి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తారువ నుంచి మాజీ మంత్రి బూడి తన వాహనంలో బుధవారం మధ్యాహ్నం దేవరాపల్లి వస్తుండగా.. మారేపల్లి సమీపంలోని రోడ్డు మలుపు తిరిగే సమయంలో.. ఎదురుగా మితిమీరిన వేగంతో వస్తున్న ద్విచక్ర వాహనాన్ని గమనించి ముందుగానే తమ వాహనాన్ని నిలిపివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ద్విచక్ర వాహనం అదుపు తప్పి నిలిపివేసిన తమ కారును బలంగా ఢీకొట్టడంతో తమ వాహనం ముందు భాగంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనంపై నలుగురు యువకులు ప్రయాణిస్తుండగా, వేపాడ కిశోర్ ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కారును ఢీకొట్టి పడిపోయిన యువకులను మాజీ డిప్యూటీ సీఎం తనయుడు వెంకటేష్ మానవతా దృక్పథంతో దేవరాపల్లిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది పరీక్షించిన అనంతరం ఇంటికి పంపించేశారు.

ఘనంగా పారువేట ఉత్సవం

- స్వయంభూ శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి


పారువేటకు ముందు గొర్రెపిల్లకు పూజ చేస్తున్న దృశ్యం

చీడికాడ: మండలంలోని అర్జునగిరిలో శ్రీదేవి, భూదేవి సమేత స్వయంభూ శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి పారువేట ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవంలో భాగంగా స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆలయానికి సమీపంలో గల దేవుని పనుకు వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వరుణదేవుని కరుణకోసం గొర్రె పిల్లకు తోక కోసి విడిచిపెట్టారు. ఆ గొర్రె పిల్ల ఏ దిక్కుకు వెళితే ఆ దిక్కున ఈ ఏడాది అధిక వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయన్నది నమ్మకమని ఆలయ అర్చకులు పానంగిపల్లి శ్రీనివాసాచార్యులు చెప్పారు. ఈ ఏడాది పుట్టిన మగగొర్రె పిల్లనే ఈ వేటలో వినియోగిస్తారు. తోక కోసి విడిచిపెట్టిన గొర్రెను పట్టుకుని పనుకుపైకి తీసుకు వచ్చిన యువకులను ఉలవకాయల దండలతో సత్కరించారు.దీంతో స్వామి పారువేట ఉత్సవం ముగిసింది. ఈ ఉత్సవాన్ని వందల సంవత్సరాలనుంచి భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ బి.రమాదేవి,ఎంపీటీసీ అమ్మతల్లినాయుడు తదితరులు తెలిపారు.అనంతరం స్వామి ఉత్సవమూర్తులతో పల్లకీ సేవ నిర్వహించారు.

స్టాఫ్ నర్సు పోస్టుల దరఖాస్తు గడువు పొడిగింపు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నిరుద్యోగుల నుంచి అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటివరకు ఆఫ్‌లైన్‌లో 7,400 దరఖాస్తులు అందినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. ఆన్‌లైన్‌లో ద్వారా దరఖాస్తులు వచ్చినట్లు ఆమె వెల్లడించారు. ముందుగా ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలని ప్రకటించినప్పటికీ.. సంక్రాంతి కారణంగా ఈ గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించారు.

అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ తేదీలోగా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకురాలు, రేసవానిపాలెం, డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని తమ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. అభ్యర్థులు మరిన్ని వివరాలకు https://nagendrasvst.wordpress. com/ లేదా https://cfw.ap.nic.in సంప్రదించవచ్చు.

బడిలో రాజకీయ పాఠాలా?


దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రాజకీయ నాయకుల బ్యానర్లు

- ఇదేనా జీవో అమలు తీరు..
- కూటమి నేతల ఫ్లెక్సీలు, కోడి పందేల నిర్వహణపై సర్వత్రా నిరసన

దేవరాపల్లి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో రాజకీయ, మత, వివాహ కార్యక్రమాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. సెలవు రోజుల్లో సైతం ఈ తరహా కార్యకలాపాలు నిర్వహణకు అనుమతి ఇవ్వరాదని విద్యాశాఖ అధికార్లకు స్పష్టం చేసింది. ఈ మేరకు గత ఏడాది నవంబర్‌లో జీవో సైతం జారీ చేసింది. అయితే ఆ జీవోకు కూటమి పార్టీ నేతలే తూట్లు పొడుస్తున్నారు. దేవరాపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు పేరిట మంగళవారం రాజకీయపరమైన కార్యక్రమంతో పాటు పాఠశాల ఆవరణలోనే కోళ్ల పందెం ఏర్పాటు చేయడం వివాదస్పదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకల్లో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొనడంపై మరింత దుమారం రేగింది. పాఠశాల భవనాలన్నింటికి రాజకీయ నాయకులతో కూడిన ఫ్లెక్సీ, బ్యానర్లను సైతం అతికించి రాజకీయాలకు వేదికగా మార్చడం పట్ల ప్రజా సంఘాలు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోకు విరుద్ధంగా ప్రైవేటు కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి లోకేష్ జీవోను అమలు చేసి తీరు ఇదేనా అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. అలాంటప్పుడు జీవోలు జారీ చేయడం ఎందుకంటూ బాహాటంగా విమర్శిస్తున్నారు. కూటమికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు పాఠశాల ఆవరణలో రాజకీయ కార్యక్రమంతో పాటు బహిరంగంగా కోళ్ల పందెం నిర్వహించగా, ఇకపై ప్రతీ గ్రామంలో ఇదే పంథాలో నాయకులు, కార్యకర్తలు పయనించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

పండగ పూట విషాదం

- సముద్రంలో మునిగి బాలుడు మృతి
- యువకుడు గల్లంతు
- ఒకే కుటుంబంలో తీవ్ర విషాదం
- బాధితులు ఉమ్మడి తూ.గో జిల్లాకు చెందినవారు


బీచ్‌లో మునిగిన బాలుడిని ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు


గల్లంతయిన మణికంఠ (ఫైల్)


ప్రమాదం జరిగిన ప్రదేశం ఇదే...

ఎస్.రాయవరం: పండగ పూట ఆనందంగా గడిపిన ఆ కుటుంబాన్ని చూసి విధికే కన్ను కుట్టినట్టు ఉంది.. క్షణాల్లో సముద్ర కెరటాల రూపంలో దాడి చేసింది. ఈ ఘటనలో బాలుడు మృతి చెందగా.. మరో యువకుడు గల్లంతయ్యాడు. ఎస్‌ఐ విభీషణ రావు అందించిన వివరాలు.. తుని మండలం లోవ కొత్తూరు చెందిన బాసనబోయిన సాత్విక్ (9), అతని మేనత్త కొడుకు అయిన ప్రతిపాడు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన కాకర్ల మణికంఠ (22)లు సుమారు 30 మంది కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రేవుపోలవరం తీరానికి వచ్చారు. సాయంత్రం వరకు సరదాగా గడిపిన వీరు స్నానం కోసం సముద్రంలోనికి దిగారు. కెరటాల తాకిడికి సాత్విక్ మునిగిపోవడం గమనించిన మణికంఠ.. సాత్విక్‌ను బయటకు నెట్టి మరో కెరటానికి కొట్టుకుపోయాడు. సాత్విక్‌ను రక్షించినప్పటికీ అప్పటికే అపస్మారక స్థితిలోనికి చేరుకోవడంతో మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు సీపీఆర్ చేసి హుటాహుటిన నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందాడు. సాత్విక్ కోసం వెళ్లి మునిగిపోయిన మణికంఠ ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. కళ్ల ముందు ఘోర సంఘటన చూసిన కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో తీరం హోరెత్తిపోయింది. గల్లంతయిన మణికంఠ సంక్రాంతికి మేనమామ ఇంటికి రెండు రోజులు క్రితం వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్.రాయవరం పోలీసులు మత్స్యకారుల సహాయంతో సాయంత్రం గాలింపు చర్యలు చేసినప్పటికీ మణికంఠ ఆచూకీ లభ్యం కాలేదు. ఎస్.రాయవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు మృతి

యలమంచిలి, కోటవురట్ల, అనకాపల్లి, రాంబిల్లి మండలాల్లో వేర్వేరు ఘటనలో ఐదుగురు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలం వద్ద విద్యార్థి అన్నం వరప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

రైలు ఢీకొని ఇంటర్ విద్యార్థి...

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రైలు పట్టాలు దాటుతున్న ఓ విద్యార్థిని గుర్తుతెలియని రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో పీఎస్ఆర్ పేటకు చెందిన అన్నం వరప్రసాద్(18) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇక్కడ డౌన్ లైన్‌లో 711/23 వ నంబరు కిలోమీటరు వద్ద రైల్వే గ్యాంగ్‌మన్.. మృతదేహాన్ని చూసి తుని రైల్వే పోలీసులకు,రేగుపాలెం రైల్వేస్టేషన్‌లో స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు.ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.బహిర్భూమికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి యలమంచిలిలో ఓ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు తుని ప్రభుత్వ రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.రేగుపాలెం రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

డివైడర్‌ను ఢీకొని..

అనకాపల్లి: జోనల్ కార్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిమ్మకాయల ప్రకాష్(30) అనే వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్‌ఐ రషీద్ తెలిపారు. పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జి ఏఎంసీ కాలనీకి చెందిన నిమ్మకాయల ప్రకాష్ మంగళవారం ద్విచక్రవాహనంపై ఏఎంసీ కాలనీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళుతున్న సమయంలో జోనల్ కార్యాలయం వద్ద వాహనానికి కుక్క అడ్డురావడంతో తప్పించబోయి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రకాష్‌ను స్థానికులు హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు తల్లి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

మెట్లపై నుంచి జారిపడి వృద్ధురాలు ...

రాంబిల్లి (యలమంచిలి): ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి ఒక వృద్ధురాలు మృతి చెందినట్టు రాంబిల్లి సీఐ సీహెచ్. నరసింగరావు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు... రాంబిల్లి మండలం మురకాడ గ్రామానికి చెందిన గనిసెట్టి సత్యవతి (69)ఈనెల 13వ తేదీ ఉదయం ఇంటి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నర్సింగరావు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

యలమంచిలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని తెరువుపల్లి గ్రామానికి చెందిన తుమ్మపాల నాగేశ్వరరావు(54) అనే వ్యక్తి విశాఖపట్నం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ఈ నెల 13న నారాయణపురం కెనరా బ్యాంకుకు వెళ్లి యలమంచిలి-అచ్యుతాపురం రోడ్డు దాటుతున్న నాగేశ్వరరావును అచ్యుతాపురం నుంచి యలమంచిలి వైపు వస్తున్న స్కూటీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం కుటుంబసభ్యులు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వరాహనదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



కోటవురట్ల: అన్నవరం శివారు వరాహనదిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సరిహద్దు విషయంలో స్పష్టత లేకపోవడంతో అటు నర్సీపట్నం రూరల్, ఇటు కోటవురట్ల పోలీసు స్టేషన్ నుంచి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీఆర్వో అప్పారావు అక్కడకు చేరుకుని కోటవురట్ల పరిధిగా తేల్చడంతో ఎస్‌ఐ రమేష్ మృతదేహాన్ని బయటకు తీయించారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచినట్టు చెప్పారు. వివరాలు తెలిసిన వారు కోటవురట్ల పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.


ఉత్సాహంగా గుర్రపు పరుగు పోటీలు

- విజేతలకు బహుమతులు అందజేసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


పరుగు తీస్తున్న గుర్రం

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో కనుమ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలకు విశేష స్పందన వచ్చింది. మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో సంతబయల యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా కనుమ పండగ రోజున రాజకీయాలకు అతీతంగా గుర్రపు పరుగు పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజల్లో ఉత్సాహం నింపేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. హుషారుగా సాగిన ఈ పోటీలను తిలకించేందుకు వచ్చిన వారితో క్రీడాస్థలం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడుపాల్గొన్నారు.న్యాయనిర్ణేతగాఆడారిగోవింద్వ్యవహరించారు.

నూక హనుమాన్ గుర్రానికి ప్రథమ బహుమతి : జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీల్లో నూక హను మాన్ గుర్రం ప్రథమస్థానం పొందింది.పవన్ వాయుపుత్ర, ఉదయ్ దిలీప్,నవీన్,నవీన్ ధర్మలకు చెందిన గుర్రాలు ద్వితీయ,తృతీయ, చతుర్ధ,పంచమ బహుమతులు పొందాయి.


పోటీల నిర్వాహకులు విజయ్,అజయ్‌లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

క్లుప్తంగా

ఘనంగా కామాక్షి అమ్మవారి తీర్థం



ఎన్టీఆర్ కాలనీలో కామాక్షి అమ్మవారి తీర్థంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రదర్శన

అనకాపల్లి: అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో కామాక్షి అమ్మవారి తీర్థం మంగళ వారం రాత్రి ఘనంగా జరిగింది. గోపాలపురం, మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం పంచాయతీల పరిధిలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది మకర సంక్రాంతి రోజున అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి ప్రదర్శించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రొగ్రాం ఆకట్టుకుంది. ఆలయం వద్ద మందుగుండు సామగ్రి పేల్చారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి పాలెం గ్రామ సర్పంచ్ సాలాపు శాంతి సూరిఅప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేవతమ్మ ఆలయంలో పూజలు



కశింకోటలోని గవరపేటలో దేవతమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కశింకోట: కశింకోటలోని గవరపేటలో ఉన్న దేవతమ్మ ఆలయంలో బుధవారం కనుమ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తమ దేవతగా భావించే వేగి కుటుంబీకులు అమ్మవారికి పిండి వంటలు సమర్పించారు.

శోభన్‌బాబుకు ఘన నివాళి



శోభన్‌బాబు జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న విజయరామరాజుపేట గ్రామ పెద్దలు

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేటలో దివంగత సినీనటుడు శోభన్‌బాబు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు పలకా రాము బొబ్బిలి అప్పారావు.. శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పిట్ల బుద్దేశ్వరరావు, పలకా సత్యనారాయణ, గండిబోయిన సత్తిబాబు, అప్పికొండ వెంకట్రావు, పల్లా శ్రీను, పసుపులేటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరుడుబాబు పరస

కశింకోట: మండలంలోని చింతలపాలెంలో బుధవారం వీరుడుబాబు పరస ఘనంగా జరిగింది. ఇక్కడ అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో ఉగ్గినపాలెం, బుచ్చియ్యపేట, బంగారయ్యపేట, అడ్డాం, అచ్చెర్ల గ్రామాల్లో కూడా తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. ఆట వస్తువులు, తిను బండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. తోడ పెద్దు సేవ, భజనలు నిర్వహించారు.

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
సంక్రాంతికి వస్తున్నాం	:పర్తిసాయి
గేమ్ ఛేంజర్	:షిర్డీసాయి
గేమ్ ఛేంజర్	:వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	:శ్రీసత్య
డాకు మహారాజ్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 72 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు , బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-37 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

చల్లని ప్రేమ

- ఏటా చలి కాలంలో యాచకులకు దుప్పట్ల పంపిణీ
- మానవత్వం చాటుకుంటున్న స్వచ్ఛంద సంస్థలు
- పట్టణంలో పెరిగిపోతున్న నిరాశ్రయులు, బిచ్చగాళ్లు



నిరంతర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాచకులు, నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న గణేష్ (ఫైల్), (ఇన్‌సెట్) పెరుగబజార్ జంక్షన్‌లో యాచకులకు దుప్పటి పంపిణీ చేస్తున్న బల్లా నాగభూషణం (ఫైల్)

అనకాపల్లి: పట్టణ, మండల పరిధిలో యాచకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. పట్టణంలో నిరాశ్రయులు, యాచకులు సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. రద్దీగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, నెహ్రూచౌక్, రైల్వే స్టేషన్, వివిధ దేవాలయాలు, శారదానది బ్రిడ్జి, గవరపాలెం పార్కు సెంటర్, రింగ్ రోడ్డు, చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ తదితర ప్రాంతాలే యాచకులు, నిరాశ్రయులకు ఆవాసంగా మారింది.

పట్టణ పరిధిలో సుమారుగా 200 మంది రహదారులపై వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంత మంది రోడ్డు, డివైడర్లపై నిద్రిస్తున్న సమయంలో అటుగా వెళ్లి గుర్తుతెలియని వాహనాలు రాత్రిళ్లు ఢీ కొనడంతో మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఏటా సాయం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతి ఏడాది రహదారులపై యాచకులను, నిరాశ్రయులను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఉదారంగా ఆదుకుంటున్నాయి. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2004 డిసెంబర్ 4వ తేదీ నుంచి ఏటా దుప్పట్లు, రగ్గులు కొనుగోలు చేసి రాత్రిళ్లు రహదారుల పక్కన నిద్రిస్తున్న వారి వద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నారు.

నిరంతర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

నిరంతర్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొమ్మోజు గణేష్ తన స్నేహితులతో కలిసి 2022 నుంచి రహదారుల పక్కన నిద్రిస్తున్న వారికి డిసెంబర్, జనవరి మాసాల్లో చలికి ఇబ్బందులు పడకుండా రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



రహదారులపై నివసించే యాచకులు, నిరాశ్రయులకు ప్రభుత్వం ఒక భవనాన్ని నిర్మించి ఆశ్రయం కల్పించాలి. వేసవిలో ఎండకు, శీతాకాలంలో చలికి కొంతమంది యాచకులు రోడ్లపైనే మృత్యువాత పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి మతిస్థిమితం లేని వారిని, వృద్ధులను జాతీయ రహదారిపై విడిచిపెట్టి వెళ్లిపోతున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు దృష్టి పెట్టాలి.

– బల్లా నాగభూషణం, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు

అప్పన్న అన్నదానానికి విరాళాలు



ఏఈవో ఆనంద్‌కుమార్‌కి చెక్కు అందిస్తున్న దాత బుచ్చినాయుడు



సూపరింటెండెంట్ నరసింగరావుకి చెక్కు అందిస్తున్న దాత కిరణ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాకకి చెందిన జి.బుచ్చినాయుడు, అనకాపల్లికి చెందిన ఎం.కిరణ్ చెరో రూ.లక్షా 1,116లు విరాళంగా చెక్కుల రూపంలో అందించారు. వీటిని ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పాలూరు నరసింగరావులు అందుకున్నారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రాలను అందించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పాల్గొన్నారు.

ఆరుగురికి కొణతాల రామలింగస్వామి పురస్కారాలు



ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ట్రస్ట్ నిర్వాహకురాలు కొణతాల లక్ష్మీపార్వతి

అనకాపల్లి: తల్లిదండ్రులు పిల్లలకు బాల్యం దశ నుంచే మానవతా విలువలు నేర్పాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపం ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో సోమవారం రాత్రి డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ పురస్కార్-2025 అవార్డులను ఆరుగురికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిస్వార్థ కార్యక్రమాలు చేస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్న వారిని వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార్ పేరుతో సత్కరించడం అభినందనీయమన్నారు. అనంతరం ఏపీ, తెలంగాణా, ఒడిశా రాష్ట్రంలో ఉపాధ్యాయ, సామాజిక సేవా, విద్యా రంగాల్లో విశిష్ట సేవలందించిన డాక్టర్ బొంతలకోటి శంకరావు, డాక్టర్ సి.గౌతమ్‌కుమార్, ఎల్లేటి మమత, నాగులు ఆదేషా, రావాడా సాయి మోహిని మానసలకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్‌శ్రీధర్, ట్రస్ట్ వ్యవస్థాకురాలు లక్ష్మీపార్వతి, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి వేడుకలు



కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పూజలు



పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న పిరట్ల నరసింహమూర్తి



నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న పీలా తులసీ కుటుంబ సభ్యులు



కేఎన్ఆర్ పేటలో చెట్టు భజన చేస్తున్న సీతారామ భజన మండలి సభ్యులు

కశింకోట: మండలంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పండగలను ప్రజలు, రైతులు ఉత్సాహంగా ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇళ్ల ముందు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ రంగవల్లులు తీర్చిదిద్దారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం తీర్థం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతీ ఆధ్వర్యంలో తోడపెద్దు సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అలాగే స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం(శివాలయం)లో అభిషేకాలు జరిపారు. శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో పల్లకిలో ఊరేగించారు. భక్తులు దారి పొడవునా దర్శించి పూజలు చేశారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం, గవరపేటలో అర్చకుడు చింతా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి, అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో లక్ష్మీ నృసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలో నూతన వస్త్రాలు సమర్పించి తమ పితృ దేవతలకు పూజలు చేశారు. బ్రాహ్మణులు, వైష్ణవులకు బియ్యం, తదితర వస్తువులు దానం చేశారు.

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేటలో సంక్రాంతి సందర్భంగా పీలా రాజారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీలా తులసీ కుటుంబ సభ్యులు మంగళవారం 100 మంది నిరుపేదలకు దుప్పట్లు, చీరలు, బియ్యం పంపిణీ చేశారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో జరిగిన పలు పోటీల విజేతలకు మండపం వ్యవస్థాపకుడు పిరాట్ల నరసింహమూర్తి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, దుర్గాప్రసాద్, బంగార్రాజు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: సంక్రాంతి సందర్భంగా సోమ, మంగళ, బుధవారాల్లో జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎన్ఆర్ పేటలో సీతారామ భజన మండలి ఆధ్వర్యంలో ఇంటింటా చెట్టు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి భజనలు తీసుకువెళ్లి పాడి పంటలు బాగుండాలని, గ్రామాల్లో రైతులు అభివృద్ధి చెందాలని, ప్రతి గృహం వద్ద చెట్టు దీపాన్ని ఉంచి భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీతారామ భజన మండలి వ్యవస్థాపకుడు చూచుకొండ రమణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కోడి పందేల జోరు

- కత్తికాటుకు నెత్తురోడిన పందెం కోళ్లు



సీతానగరంలో కత్తి కట్టిన కోళ్లతో జోరుగా జరుగుతున్న కోడి పందేలు

తుమ్మపాల: కోళ్లకు కత్తులు కట్టి హింసించడం దారుణమంటూ.. కోడిపందేల ఆటలపై నిషేధం విధించిన సుప్రీం కోర్టు తీర్పును సైతం పక్కనపెట్టి కూటమి నాయకులు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. మండలంలో సుందరయ్యపేట, సీతానగరం, మారేడుపూడి ప్రకృతి లేఅవుట్‌లో మంగళవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో విచ్చలవిడిగా కోడిపందేలు జరిగాయి. కోళ్ల కాళ్లకు కత్తి కట్టి నిర్వహించిన పందేల్లో లక్షల రూపాయలు చేతులు మారాయి. సీతానగరం గ్రామంలో కోడి పందేలతోపాటు పేకాట నిర్వహణ బహిరంగంగానే జరిగింది. బుధవారం కనుమ రోజున కూడా అనేక గ్రామాల్లోని తోటల్లో విచ్చలవిడిగా కోడి పందేలు, పేకాట శిబిరాలు జరిగాయి. శీరంశెట్టివానిపాలెం, పాపయ్యపాలెం గ్రామాల్లో సాయంత్రం నుంచే రికార్డింగ్ డాన్సులు ఏర్పాటు చేశారు. కోడిపందేల నిర్వాహణపై పోలీసులు నామ మాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు తలొగ్గి పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. నేటి నుంచి మరికొన్ని గ్రామాల్లో కోడిపందేలు, పేకాట శిబిరాలను ఏర్పాట్లు చేస్తున్నారు.

18న వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల వేడుక



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ సీఎం రమేష్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో పట్టణంలో కుంచావారి, వేల్పులవీధి, గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీ సీఎం.రమేష్ అన్నారు. స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారిని బుధవారం సాయంత్రం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 18న వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ వాకాడ బాబు ఎంపీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఆలయ కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

చినమాకవరంలో వీరన్న తీర్థం



చినమాకవరంలో కొండ ఎక్కుతున్న భక్తులు

అనకాపల్లి: మండలంలో చినమాకవరం గ్రామంలో వీరన్న(కోరుకొండ వీరేశ్వరస్వామి) కొండ తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. కొండపైన శివపార్వతీలకు ప్రత్యేక పూజలు చేశారు. మాకవరం, మార్టూరు, మామిడిపాలెం, కొండుపాలెం, సీహెచ్ఎన్ అగ్రహారం, రేబాక పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పొలాల మీదుగా కోరుకొండకు చేరుకుని మట్లమార్గం ద్వారా కొండెక్కి వీరన్న స్వామిని దర్శించుకున్నారు. చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు, కొత్త దంపతులు పెద్దెఎత్తున ఉదయం నుంచి వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం కొండ దిగువన తప్పెటగుళ్లు, నేల వేషాలు, భజనలు, స్టేజ్ ప్రోగ్రాంలు వీరన్న కొండ కమిటీ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం పంచదార చిలుకలు, చిన్నచిన్న ఆట వస్తువుల విక్రయాలు, గాలిపటాలు ఎగురవేశారు. అంతకుముందు మార్టూరు, మామిడిపాలెం, మాకవరం, పాపయ్యసంతపాలెం గ్రామాల నుంచి చెట్టు భజనను స్వామివారి కొండ దిగువకు తీసుకొచ్చి వీరన్నకొండపైకి చూపించి మళ్లీ తిరుగు ప్రయాణం చేశారు.

ముగిసిన ఫోర్ బౌండరీ క్రికెట్ పోటీలు



అరవింద్ క్రికెట్ టీమ్‌కు కప్‌ను అందజేస్తున్న జగన్నాథస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు

అనకాపల్లి: క్రీడలతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని జగన్నాథస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు అన్నారు. స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్‌లో ఎస్‌డీ గ్రూప్, సర్వేజనా ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోర్ బౌండరీ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో 18 క్రికెట్ టీమ్‌లు ఆడాయన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి అరవింద్ క్రికెట్ టీమ్ కైవసం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, సర్వేజనా ఐక్య వేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి, క్రికెట్ టీమ్ ఆర్గనైజర్లు ఆడారి సతీష్, కొణతాల శ్రీను, దాడి కిషోర్, గౌరీ, జోగా దివాకర్, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

తక్షణం హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి



కశింకోటలో మాట్లాడుతున్న వేగి రవి, సుభాని

కశింకోట:

తక్షణమే తమను విధుల్లోకి తీసుకోవాలని బాధిత హెల్త్ అసిస్టెంట్లు ఈశ్వరరావు, వేగి రవి, సుభాని, శరగడం అప్పలనాయుడు తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ వారు మాట్లాడుతూ మెరిట్‌లో ఉండి కూడా తాము ఉద్యోగాల నుంచి తొలగింపునకు గురి కావడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తుందన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి సత్వరమే మెరిట్ జాబితా సిద్ధం చేసి అర్హులను పునర్నియమించి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష రాసి 22 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారే ఉద్యోగాలు కోల్పోయి బాధితులుగా మారాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం హెల్త్ అసిస్టెంట్ల ఆవశ్యకతను గుర్తించిందని, గ్రామీణ స్థాయిలో ప్రజారోగ్యాన్ని కాపాడటానికి, మలేరియా వ్యాధుల నిర్మూలనకు అవసరమని పేర్కొందన్నారు. ఈ మేరకు రాష్ట్రాలకు ప్రత్యేక లేఖ కూడా రాసిందన్నారు. గ్రామీణ స్థాయిలో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలతతో పరిశీలించి హెల్త్ అసిస్టెంట్ల పునర్నియామకానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు.

కోడి పందేల శిబిరాలపై దాడులు



చెరకాంలో పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కశింకోట: మండలంలో కోడి పందాల శిబిరాలపై బుధవారం పోలీసులు దాడి చేశారు. నలుగుర్ని అదుపులోకి తీసుకుని, నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. చెరకాం గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతుండగా దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి, రెండు కోడి పుంజులను, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఏనుగుతుని శివారులో కోడి పందాలు ఆడుతున్న ఇద్దర్నీ పట్టుకొని, రెండు పందెం కోళ్లు, రూ.1170 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలి

అనకాపల్లి: పట్టణ పరిధిలో రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేసిన పెద్దపెద్ద ఫ్లెక్సీలు కారణంగా వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పందించి తక్షణం తొలగించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదానది, పూడిమడక జాతీయ రహదారి నుంచి జంక్షన్ వరకూ మెయిన్ రోడ్డులో గోతులు తీసి రహదారికి అడ్డదిడ్డంగా, డివైడర్ మధ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. దుకాణాల వద్ద కూడా అనధికారికంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని ఆయన ఆరోపించారు.

ఘనంగా మకర జ్యోతి వేడుకలు



అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: మకర సంక్రాంతి సందర్భంగా స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతీ ఆలయంలో మంగళవారం అయ్యప్పస్వామి మకర జ్యోతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంతకు ముందు అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి గవరపాలెంలో ఊరేగించారు. స్వామివారి మూల విరాట్‌కు 18 రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. రాత్రికి ఆలయంలో 18 మెట్లకు పడి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాని, ఆలయ ప్రధాన గురుస్వామి మద్దాల నారాయణరావు, గౌరీ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు మళ్ల సాంబశివరావు, అనకాపల్లి వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు సంక్రాంతి పోటీలు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న బి.ఉమామహేశ్వరరావు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో సంక్రాంతి ఉత్సవాలు జరిగాయని, తెలుగు సాంస్కృతిక సంప్రదాయాలకు గ్రామాలు పుట్టిన ఇళ్లని అనకాపల్లి చిల్డ్రన్ క్లబ్ కన్వీనర్ బి.ఉమామహేశ్వరావు అన్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్‌లో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చిన్నారులకు సంక్రాంతి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు సంక్రాంతి ఉత్సవాలపై అవగాహన కల్పించాలని కోరారు. అంతకు ముందు చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు, గ్లాస్ బాల్ పోటీలు, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి, విజేతలకు బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎ.వాణిశ్రీ, జి.సుభాషిణి, గంటా శ్రీరామ్, యర్రంశెట్టి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.